## పాతికేళ్ల కాపురం తర్వాత భర్త గొప్పతనం ఆమెకి ఎలాతెలిసింది?

# అయ్యవారినట్టిల్లు

### పాలెపు బుచ్చిరాజు కథ

నలభై ఏళ్లపాటు బడిపంతులుగా ఉద్యోగం చేసి, ఈ మధ్యనే రిటైరయ్యారు కిష్టమూర్తి మేష్టారు. ఇన్నాళ్ల సర్వీసులో తను సాధించేదేమిటి? అని సింహావలోకనం చేసుకుంటే – ఉందనుకుంటే చాలా ఉంది. లేదు అనుకుంటే ఏమీలేదు.

అందరూ 'బతకలేక బడిపంతులు' అనుకునే ఉద్యోగాన్ని ఆయనొక తపస్సుగా భావించి ఆచరించారు. తనముందు పుట్టి పెరిగిన కుర్రకుంకలు, ఆకతాయితనం చేస్తూనే, తన దగ్గిర చదువుకుని పెద్ద పెద్ద ఉద్యోగాల్లోకి వెళ్లిపోవడం కళ్లారా చూశారు. ఈనాటి గవర్నమెంటు ఉద్యోగాల్లో, రాజకీయాల్లో, విదేశాల్లో ఎన్నోచోట్ల తన దగ్గిర చదువుకున్న విద్యార్థులు స్థిరపడ్డారు. ఏ బళ్ళోపని చేసినా, ఏ ఊళ్లో పనిచేసినా శిష్యులంతా ఆయనకి బ్రహ్మరథం పట్టేవారు. తన విద్యార్థుల్ని ప్రేమతో కంటికి రెప్పలా కాపాడుతూ విద్యాబుద్ధులు చెప్పి వారి భావిజీవితాల్ని తీర్చిదిద్దారు కిష్టమూర్తి మేష్టారు. ఆయన దగ్గర విష్యరికం చేసిన వాళ్లందరూ ఎక్కడున్నా, కృతజ్ఞతతో వారి మేష్టార్ని తలుచుకోని రోజు ఉండదు. వాళ్లే ఆయన సంపాదించుకున్న ఆస్థి. ఆ సంతృప్తి మాత్రమే ఆనయకు మిగిలే మహాభాగ్యం. ఉందనుకుంటే అంత ఉంది.

అయితే మాత్రం కిష్టమూర్తి మేష్టారేం మేడలూ మిద్దెలూ కట్టలేదు. కొండంత ఆశతో తన చిటికెనవ్రేలు పట్టుకుని వచ్చిన ఇల్లాలికి ఒంటి నిండా నగలూ చేయించలేదు. ఇప్పటికీ ఆమె చేతులకి మట్టిగాజులే. మెళ్లో పసుపుతాడే. ఆ!... ఆరుగురు



సంతానాన్ని మాత్రం కన్నారు. వారి జీవన వ్యవసాయంలో పండిన పంట అదే! ఇద్దరు కొడుకులూ, నలుగురు కూతుళ్లానూ. పోనీ నీకెలాగూ లేదు. ఈనాడు మంత్రి పదవిలో ఉన్న ఓ పాత విద్యార్థిని ఆశ్రయించి , పట్టభద్రులైన నీ కుర్రాళ్లకైనా మంచి ఉద్యోగాలు వేయించుకోవచ్చుగా అని మిత్రులిచ్చిన సలహా కూడా సుతరామూ

నచ్చలేదాయనకు. నా దగ్గర చదువుకున్నంత కాలం వాళ్లకి నీతి, న్యాయం, ధర్మం నూరిపోసి, ఇవ్వాళ వాళ్ల చేతనే తప్పుడు పనులు చేయించడమా! ఎంత నీచం! అని ఊరుకున్నారు. 'మీరు తల్చుకుంటే మా జీవితాలు ఇంకా బాగానే ఉండేవి' అని కొడుకులూ, కోడళ్లూ మూతులు ముడుచు కోవడం ఆయనకి కొత్తేమీకాదు. వాళ్లు సరే పిల్లలు. భార్య కాంతం మాత్రం ఏం తక్కువ తిందని! మేష్టారంటే ఎప్పుడూ ఈసడింపే. పక్కింటివాళ్లూ, పొరుగింటివా ళ్లూ చూస్తూండగానే అంతంత ఎత్తులకి ఎదిగిపోవడం, తాము మాత్రం ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే అన్నట్టు గొర్రెతోక జీతాల్తో ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోవడం ఆమెకెంతో అవమానకరంగా ఉండేది. ఆవిడ దృష్టిలో మేష్టారొక చేతకాని దద్దమ్మ. అందుకే వాళ్ళిల్లెప్పుడూ "అయ్యవారి నట్టిల్లు"లాగే ఉండిపోయింది. ఓ ముద్దూ ముచ్చటా లేదు. నగా న్రటా లేదు. తీర్థాలూ, యాత్రలు అసలు లేనేలేవు. ఎన్నిసార్లడిగిందో 'ఓసారి తిరపతి వెళ్లి వద్దామండీ' అని. అంతభాగ్యం కూడానా! అబ్బే పడనిస్తేగా! ఎంటో! తన ధోరణే తనది. ఎంతసేపూ, పిల్లలూ, బడీ, పుస్తకాలూ, పాఠాలూ అదో మాయలోకం. మరేమీ పట్టేదిగాదు ఆయనకి.

ఇలాంటి ప్రపంచంలో ఉంటూ, నిమ్మకు నీరెత్తినట్టుండడం మేష్టారికే తగింది. గీతాకారుణ్ని బాగా అర్థం చేసుకున్నది ఆయనొక్కరేనేమో! అనిపిస్తుంది. కర్మ యోగాన్ని నమ్మి, "నిమిత్త మాత్రం భావ సవ్యసాచిం!" అన్న కృష్ణ భగవానుడే అన్నిటికీ సాక్షి కనుక ప్రతిఫలాపేక్ష లేకుండా తన పని తాను చేసుకుంటూ పోయారు. కాని అప్పుడప్పుడూ నట్టింట్లో పడకుర్చీలో కూర్చుని ఇంటినీ, ఇల్లాలినీ పరికించి చూసినప్పుడు, ఈ విషయంలో మాత్రం నా బాధ్యతని కొంత విస్మరించి ప్రవర్తిస్తున్నానేమో! అనిపించి, మనసు చివుక్కుమనేది ఆయనకి.

పాపం దాని జీవితం అంతా నూతిలోని కప్ప మాదిరి అయింది. నన్ను కట్టుకుని అదేం సుఖపడిందని? నేను మాత్రం ఏం చేయగలను. అంత సావకాశం ఉన్నవాడిని కానుకదా! ఇదిగో రిటైరయ్యాక ఇప్పుడు చేతికొచ్చింది కొంత డబ్బు. జీవితంలో అంత పెద్ద మొత్తం కళ్లజూడటం అదే ప్రథమం. 'పాపం! దానికేమైనా చేయించి పెట్టాలి. దాన్ని కాస్త సంతోషపెట్టాలి!" అనుకుంటున్న మాస్టారి మనసులో మెరుపు లాంటి ఆలోచన తట్టింది. వెంటనే ప్రసన్నంగా చిరునవ్వుతో వెలిగిపోతున్న ముఖంతో "కాంతం! ఒసేవ్ కాంతం!" అని కేకేశారు.

అలవంటింటి పురంలో మడిబట్టతో వంట చేస్తున్న కాంతమ్మగారు "ఆ! వస్తున్నానండీ!" అని సమాధానం చెప్పి 'ఈ ముసలాయనకి బడి డ్యూటీ లేకపోవడంతో నాకు పాఠాలు చెప్పేస్తున్నాడు" అని గొణుక్కుంటూ వచ్చింది. గుమ్మం దగ్గర నిలబడి "చెప్పండి— అవతల పనుందినాకు. నేనింకా రిటైరవలేదుగా!" అంది.

"అదికాదే! మరి మనం తిరుపతి వెళ్లి


స్వామి దర్శనం చేసుకొద్దాం. రేపే ప్రయాణం. అన్నీ సర్దేసుకో నువ్వు'' అన్నారు మేష్టారు.

కాంతమ్మగారు ఆశ్చర్యంలో మునిగిపోయింది. గుళ్లో దేవుడి ముందు దీపంలా వెలిగిపోయింది ఆమె ముఖం.

''నిజంగానే?'' అన్న ఆమె ప్రశ్నకి, ''నిజంగానే!'' అన్న ఆయన సమాధానం విని కొయ్యముక్కలా వంటింటి ద్వారాన్ని ఆనుకుని కదలని కాంతాన్ని చూసి ''ఏమిటే! అదీ! లెక్కల్లో నూటికి నూరు మార్కులొచ్చినదానిలా అలా నిలబడిపోయావు? పోయి పని చూసుకుని ప్రయాణంకా! అని హెచ్చరించారు కిష్టమూర్తి మేష్టారు.

** ** **

మర్నాడు హడావుడిగా అన్నీ సర్దేసుకుని దూరాన్నున్న రైల్వే స్టేషనుకి నడిచే వెళ్లాలి కాబట్టి గంట ముందుగానే బయల్దేరారు దంపతులిద్దరూ. వీధిలోకొచ్చి ఆపదుద్ధారక మంత్రం ఇంకా నోట్లో ఆడుతూండగానే ప్రక్కనుంచి ధూళి రేపుకుంటూ దూసుకుపోయిన మారుతీకారు సడెన్ బ్రేకుతో వారి ప్రక్కన ఆగింది. డ్రైవరు సీట్లోంచి ఓ పెద్ద కాంట్రాక్టరు లాంటి మనిషి దిగాడు. ''నమస్కారం మాష్టారూ! నన్ను గుర్తుపట్టలేదా? గుర్నాధాన్ని. ఏంటిలా పొద్దునే బయల్దేరారు? అమ్మగార్ని కూడా నడిపించేస్తున్నారు'' అని భక్తి శ్రద్ధలతో పలకరించాడు. గుర్నాథం పేరు విన్నాక అతన్ని గుర్తించడం సులభం అయింది కిష్టమూర్తి మేష్టారికి. వీడు బెన్నయ్యశెట్టి కొడుకు కదూ! వట్టి మొద్దబ్బాయి. ఒక్క పాఠం తిన్నగా వచ్చి చచ్చేది కాదు. ''నీకొడుకుని బాగా చదివించుకోవయ్యా శెట్టీ'' అంటే, ''పెద్ద చదువులు మాకెందుకులే అయ్యవారూ! రూపాయలు లెక్కెట్టుకోవడం నేర్పండిచాలు'' అనేవాడు వాళ్లనాన్న. అలాంటిది వీడింతటి వాడయ్యాడూ? మారుతీలో తిరుగుతున్నా



డంటే బాగానే సంపాదిస్తున్నాడన్నమాట అని ఆలోచిస్తూ పరధ్యానంగానే "ఆ! నిన్ను ఎరక్కేం? ఇదుగో తిరుపతి వెళ్ళొద్దామని!" అని జవాబు చెప్పారు మేష్టారు. "రండి మాష్టారూ! నాబండిలో దింపేస్తాను. అంత దూరం అమ్మగార్ని కూడా నడిపించడం ధర్మంకాదు" అన్నాడు గుర్నాథం. ఈ పంతులెక్కడ కాదని వచ్చిన అదృష్టాన్ని కాలదన్నేస్తాడోననే ఆతురతతో కాంతమ్మగారు "పాపం! మీ శిష్యుడు ప్రాధేయపడుతున్నాడు. కాదనకండి" అని ప్రాధేయపడింది. గుర్నాథం డోరు తెరిచి ఇద్దర్నీ జాగ్రత్తగా సీట్లో కూర్చోబెట్టి రెప్పపాటులో రైల్వే స్టేషనులో దింపేసి సెలవు తీసుకున్నాడు. జీవితంలో మొట్టమొదటిసారిగా మెత్తటి కారుసీటులో ప్రయాణం చేసిన కాంతమ్మగారు తెల్ల ఏనుగునెక్కి ఊరేగినంత సంబర పడింది.

నెమ్మదిగా నడుచుకుంటూ టికెట్ విండో చేరుకుని "బాబూ! తిరుపతికి రెండు టిక్కెట్లివ్వండి" అని డబ్బు చేత్తో పట్టుకుని అడిగారు మేష్టారు. అవతలున్న మనిషి "ఉండవయ్యా! ఇప్పటి నుంచీ తొందరేంటి? బండి గంటలేటు" అని విసుక్కోబోయి ఇటున్న మాష్టార్ని చూసి అర్థోక్తిలోనే ఆగిపోయాడు. "అయ్యో! గురువుగారూ! మీరు! ఉండండి!" అంటూ, ఆదుర్దాగా అటుగుమ్మం గుండా బైటికివచ్చి దంపతులిద్దర్నీ ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్లాడు. అప్పర్ క్లాసు వెయిటింగ్ రూములో కాళ్లు బార్లా చాపుకుని కూర్చునే పెద్ద చెక్క కుర్చీలమీద కూర్చోబెట్టి "ఇప్పుడు చెప్పండి గురువుగారూ! మీరు నన్ను గుర్తుపట్టలేదు కదూ!" అని అడిగాడు. కిష్టమూర్తి మేష్టారు కొంచెం సంశయంగానే ముఖంలో పోలికల్నిబట్టి ప్రయత్నించి, "నువ్వు పేరిశాస్త్రి కొడుకు అవధానివి కదూ!" అన్నారు. "అవును మాష్టారూ! బాగానే జ్ఞాపకం ఉన్నానే మీకు. ఏదో మీరు పెట్టిన సరస్వతీ భిక్షతో రైల్వేలో క్లార్కుగా జాయినై ఇలా జీవితం వెళ్లమెట్టుతున్నాను. అయితే ఇన్నాళ్లకి మీకు తిరుపతి వెళ్లే తీరిక దొరికిందన్నమాట. నాదో చిన్న కోరిక. మీరు కాదనడానికి వీల్లేదు. మీ ఇద్దరికీ టిక్కెట్లు నేను తీస్తాను. ఇహ మీరేం చెప్పినా వినను" అని వెళ్లి రెండు టిక్కెట్లు తీసుకొచ్చి ఇచ్చాడు. రైల్వే కూలీ మాకరాజుని పిలిచి "ఒరేయ్, బాబుగారినీ, అమ్మగారినీ జాగ్రత్తగా దగ్గరుండి రైలెక్కించు, నాకు చదువు చెప్పిన మాష్టారు తెలిసిందా!"

అని హెచ్చరించి డ్యూటీలోకి వెళ్లిపోయాడు అవధాని. ఏం మాట్లాడాలో తెలియక ఉక్కిరి బిక్కిరవుతోంది కాంతమ్మగారు.

రైలొచ్చింది. పెట్టెలో ఎక్కి ఓ ప్రక్కగా సీటు మీద ఒకరి ప్రక్కనొకరు కూర్చున్నారు. కాంతమ్మగారు పదిమందిలో అలా ఎప్పుడూ ఆయన ప్రక్కన కూర్చుని ప్రయాణం చేసే అలవాటు లేక సిగ్గుతో మరోవైపు చూస్తూ మౌనంగా కూర్చుంది. రెండు మూడు గంటల ప్రయాణం అయివుంటుంది. అప్పుడొచ్చాడు టి.టి.ఇ. చెకింగుకి. వాళ్లిద్దర్నీ పరిశీలనగా చూసి టిక్కెట్లు చెక్‌చేసి, "మీరిద్దరూ ఇక్కడెలా

కూర్చున్నారండీ? ఇవి మీసీట్లు కాదు'' అన్నాడు. కొంచెం కంగారు పడినా కిష్టమూర్తి మేష్టారు తెచ్చి పెట్టుకున్న ధయిర్యంతో ''ఇది రిజర్వేషను పెట్టికాదుగదా నాయనా! మరి అభ్యంతరం ఏమిటి?'' అని అడిగారు. ''అవన్నీ తరువాత చెప్తుతాను. పై స్టేషన్లో దిగి నాతో రండి'' అని కంపార్టుమెంటులో మిగతావారి టిక్కట్లు చెక్ చేయసాగాడు టి.టి.ఇ. పై స్టేషను రాగానే ''లేవండి పంతులుగారూ! రండమ్మా!'' అని ఇద్దర్నీ తనవెంట తీసుకువెళ్లాడు. నాలుగు కంపార్టుమెంట్లు దాటి అయిదో దాంట్లో వారిద్దర్నీ ఎక్కించాడు. అది అప్పర్ క్లాసు బోగీ. ఖాళీగా ఉన్న ఓ కూపెలోవారిని కూర్చోబెట్టి, ఎక్సస్ ఫేర్ టిక్కట్టు రాసిచ్చి, చిరునవ్వుతో ఆయన కందించాడు. ఏమీ పాలుపోని పరిస్థితి ''నాయనా! ఏంటిది. నాకేం అర్థం కావడం లేదు'' అన్నారు మేష్టారు. ''ఏం గురువుగారూ! మీకర్థంకాని పని చేస్తే ఓ తొడపాశంతీసి, ఓ లెంపకాయ వేయలేరా?'' అని నవ్వుతూ అడిగాడు ప్రక్కనే కూర్చుంటూ. అప్పుడు గ్రహించారు మాష్టారు 'వీడూ నా శిష్యుడే అయివుండాలి!' అని. ''ఎవరు బాబూ నువ్వు? జ్ఞాపక శక్తి తగ్గింది. ఒకంతట నిన్ను పోల్చుకోలేకపోతున్నాను'' అని అడిగారు. ''అప్పన్న కొడుకు చలమయ్యని మాష్టారూ! మీ చేతి చలవే ఇది. మరచిపోతానా? తక్కువజ్ఞాతి వాడినని హీనంగా చూడకుండా శ్రద్ధగా పాఠాలు చెప్పి నన్నింతటి వాణ్ని చేశారు. మీ కటాక్షమే ఈ రోజు నాకింతకూడు పెడుతోంది. తిరుపతి వెళ్లేవరకు మిమ్మల్నెవరూ డిస్టర్బు చేయరు. వెంకన్నబాబు హుండీలో ఈ డబ్బు నాపేర్న వేయండి. వస్తాను. డ్యూటీ చేసుకోవాలి'' అని ఏభై రూపాయలు చేతిలో పెట్టి మరో కంపార్టుమెంటులోకి వెళ్లిపోయాడు. అప్పుడు పంతులుగారి మెదడులో ఓనాటి మెరికలాంటి కుర్రాడు చలమయ్య మెదిలాడు. ''అవును వీడు నిమ్నజాతి వాడని నీచంగా చూసేవారు తోటిపిల్లలు.



## ముసలాడు

కుర్రోడు అన్నాడు తల్లితో

''అమ్మా ఒక పావలా ఇవ్వవే. పాపం వీధిలో ఒక ముసలివాడు అరుస్తున్నాడు''

''ఎవరా ముసిలోడు''

''ఐస్క్రీమ్‌లమ్మే ముసలాడమ్మా''

– కె.వి.మధుసూదనరావు (కాకినాడ)

అదేమిటో చదువులో మా(్ర)తం వీడెప్పుడూ ముందే ఉండేవాడు. సరస్వతీ కటాక్షం అంటే ఇదే అనుకుంటూ ఉండేవాడిని నేను. నాకీ ఉచ్చనీచాల్తో నిమిత్తం ఏమిటి? నా దృష్టిలో బాగా చదువుకున్నవాడే ఉచ్చజాతివాడు. చదువులేనివాడు నీచజాతివాడు. అందుకే చలమయ్య బాగా చదువుకున్నకొద్దీ ఇంకా బాగా చెప్పాలని సరదాగా ఉండేది.

నాకు బాగా జ్ఞాపకం వాడు అయిదో క్లాసులో ఉన్నప్పుడు, వాడికి ఎనిమిదో క్లాసువాళ్లని మించిన జ్ఞానం ఉండేది. అయితే వాడిప్పుడు బుద్ధిమంతుడై రైల్వేలో ఉద్యోగం చేసుకుంటున్నాడన్నమాట. చాలా సంతోషం'' ఇలా సాగుతోంది మేష్టారి ఆలోచనా పరంపరం. కాంతమ్మగారి లోకం లోనే లేదు. ఆమెదంతా నమ్మశక్యంగాని నిజంగా కనిపిస్తోంది. బతికుండగానే భూలోకం నుంచి స్వర్గానికి వెళ్లిపోయొచ్చేసినట్టనిపిస్తోంది. బయల్దేరిన దగ్గర్నుంచీ కారులో లిఫ్టు, (్ర)ఫీగా టిక్కెట్లు, ఫస్టుక్లాసు పెట్టెలో (్ర)పయాణం, భగవంతుడిలా వాళ్ల నెందుకు అంతస్థులెక్కించేస్తున్నాడో బోధపడడం లేదు ఆమెకి.

తెల్లారేసరికి రైలు తిరుపతి చేరుకుంది. క్యూలో నిలబడి కొండపైకి టిక్కెట్లు తీసుకుని, దేవస్థానంవారి బస్సులో తిరుమల చేరుకున్నారిద్దరూ. చౌ(్ల)ట్రీలో గదుల కోసం మళ్లీ పెద్దక్యూ! గంటకు పైగా మండుటెండలో నిలబడి, ఎలాగైతేనేం కౌంటరు చేరుకున్నారు. అక్కడున్న అధికారి, ''మీరు ఎంతమంది? వేగంగా చెప్పండి. ఒకరోజు కంటె ఎక్కువ ఉండడానికి వీల్లేదు. తెలుసుగదా! రేపు పదకొండు కొట్టేసరికల్లా ఖాళీ చేసేయాలి. చెప్పండి ఎంతమందో!'' అని అడిగాడు. ''అలాగే బాబూ! మేమిద్దరమే. మంచి రూము చూసి ఇప్పించండి'' అని అడిగారు మేష్టారు. కంఠం గుర్తుపట్టి తలెత్తి చూసి ''అరెరె! కిష్టమూర్తి మాస్టారా! అదేంటిసార్, ఇంతసేపు మీరిలా ఎండలో... ! అయ్యయ్యో! ఇలా లోపలికి రండి'' అంటూ (్ర)పక్కనే ఉన్న ఇనప కటకటాల తలుపు తెరిచి లోపలికి ఆహ్వానించాడు. కౌంటరు దగ్గర పని మరో మనిషికి అప్పగించి వాళ్ళిద్దర్నీ లోపల (్ర)పక్క తన గదిలోకి తీసికెళ్లాడు. కూర్చోబెట్టి, చల్లటి మంచినీళ్లిచ్చి, ఇప్పుడు చెప్పండి మాస్టారూ! నాకు చాలా సంతోషంగా ఉంది ఈరోజు. చాలా కాలానికి మిమ్మల్ని చూశాను. ఇంతకీ మీరు నన్ను ఇంకా గుర్తు పట్టినట్టు లేదు. నేను సూర్యారావుని మాస్టారూ! మీరు తిట్టేవారుగా, సూర్యారావు, ఎక్కాలు రావు! లెక్కలు రావు! పాఠాలు రావు! వెధవారావు! అని వాడినే నేను. చిన్నప్పుడు అల్లరి చిల్లరిగా తిరిగి చదువుని అ(్ర)శద్ధ చేశాను. చాలా కాలం నిరుద్యోగిగా ఉండి, ఈ మధ్యనే తెలిసిన వారి నా(్ర)శయించి దేవస్థానంలో చిన్న ఉద్యోగం వేయించుకున్నాను. జీవితంలో స్థిరపడాలనే బుద్ధి ఇప్పటికి పుట్టింది. ఇదీ మీ ఆశీర్వాద బలం వల్లనే మాస్టారూ! నాకిప్పటికీ జ్ఞాపకం. నా పెంకితనానికి విసిగిపోయి, ఖరికి నా తలిదం(్ర)డులే నన్ను అసహ్యించుకునేవారు. కాని మీరు మా(్ర)తం నన్నెంతో (్ర)పేమగా చూసేవారు. మీచేతి బెత్తం ఏనాడూ నన్ను కొట్టడానికి లేవలేదు.

వీలైనప్పుడల్లా నన్ను చేరదీసి, ఎంతో బుజ్జగించి చదువుకుంటే ఎంత మంచిదో బోధించి చెప్పేవారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్లు, దేవుడులాంటి మాస్టారు దొరికినా ఏ గ్రహచారమో నాకు చదువు లేకుండా చేసింది. సరే! ఇవన్నీ చెప్పి ఇప్పుడు మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకు? చెప్పండి. మీరిక్కడ ఎన్నాళ్లున్నా, మీకు కావలసినవన్నీ నేను స్వయంగా చూస్తాను. దేనికీ సంశయించకుండా చెప్పండి'' అని భక్తి వినయాల్తో అడిగాడు.

ఇంతవరకు గంభీరంగా ఉన్న కిష్టమూర్తి మాష్టారు మంచులా కరిగిపోయారు. ఎంతో ఆప్యాయంగా సూర్యారావుని కౌగలించుకుని, కళ్లనిండా నీళ్లు పెట్టుకుని, గద్గదిత స్వరంతో, ''ఎవరన్నార్రా నిన్ను పనికిరాని వాడని? ఈనాడు నా శిష్యులందరిలో నిన్ను చూసే నేను ఎక్కువ గర్విస్తున్నాను. నువ్వు నాకీరోజున ఏ సహాయం చేసినా కాదనకుండా అంగీకరిస్తాను'' అన్నారు. ఆ సమయంలో కిష్టమూర్తి మాష్టారిలో, భగవంతుడి ప్రతిరూపాన్ని చూసింది కాంతమ్మగారు. ఆమెలో ఆయనపై పూజ్యభావం వెల్లివిరిసింది.

''మీరిక్కడే రెండు గంటలసేపు విశ్రాంతి తీసుకోండి. నేను వెళ్లి అన్ని ఏర్పాట్లు చేసివస్తాను'' అని వెళ్లిపోయాడు సూర్యారావు. అపరాహ్ణంవేళకి, కాంటీన్ నుంచి రెండు అరిటాకుల్తో, కారియర్‌లో భోజనం వచ్చింది. భోజనాలు పూర్తయ్యే సమయానికి సూర్యారావు తిరిగివచ్చాడు. ''పదండి మాష్టారు'' అని తనవెంట వారిని తీసుకుని వెళ్లాడు. రాంబగీచా గెస్టు హవుసులో రెండు మంచాలూ మెత్తటి పరుపులూ ఉన్న రూము చూపించి ఇది మీ రూము అని చెప్పాడు. జేబులోంచి ఒక రసీదు తీసి పంతులుగారి చేతికిచ్చి ''ఇది స్వామి ప్రత్యేక కళ్యాణోత్సవానికి రసీదు. ఇది తీసుకుని రేపు ఉదయం పది గంటలకు మీరిద్దరూ వైకుంఠ ద్వారం వద్దకు రండి. అక్కడ నేను ఉంటాను.'' అన్నాడు. ''అయ్యయ్యో!

## పెద్ద శిక్ష

థాయ్‌లాండ్‌కు చెందిన బ్యాంకాక్ క్రిమినల్ కోర్టు 27 జూలై, 1989న ఎనిమిది మంది దోషులకు 1,41,078 సం.ల జైలుశిక్ష విధించారు. ప్రజల దగ్గరనుండి మిలియన్ల డాలర్ల నిధులు వసూలు చేసి గుటకాయస్వాహా చేసిన ప్రభుద్దులు ఈ ఎనిమిది మంది. మరి ఇంత పెద్ద శిక్ష వేసినా చిన్నదే లెక్క. ఎందుకంటే బతికేది మహా అయితే వందేళ్లే కదా!



—రజనీశకుంతల (సికింద్రాబాద్)

ఎందుకింత శ్రమ తీసుకుంటున్నావు బాబూ! ధర్మదర్శనంతో సరిపెట్టుకునేవాళ్లం కదా!'' అన్న మాష్టార్ని వారించి ''అదేంటి సార్! మరి నా రుణం ఎప్పుడు తీర్చుకోను? వెళ్లివస్తాను'' అని వెళ్లిపోయాడు సూర్యారావు.

ఆ సాయంత్రం స్నానం చేసి గుడికివెళ్లి ధర్మదర్శనం చేసుకొచ్చారు దంపతులిద్దరూ! మర్నాడు ఉదయం సూర్యారావు సహాయంతో కళ్యాణోత్సవం, పునర్దర్శనం నిరాఘాటంగా జరిగిపోయాయి. తిరిగి రూముకొచ్చాక భర్తపై పెరిగిన గౌరవాభిమాన భారంతో ఒక్కసారిగా ఆయన కాళ్లపై పడింది కాంతమ్మగారు. పశ్చాత్తాపంతో తప్తమైన ఆమె హృదయం కరిగి కన్నీరై ధారాపాతంగా కారజొచ్చింది. ''ఏమండీ! నన్ను క్షమించండి. అజ్ఞానురాలిని. ఇన్నాళ్లూ నానట్టింట్లో, నా ఎదుటనే నడయాడే నారాయణుని నేను కానుకోలేకపోయాను. మన ఇల్లు అయ్యవారి నట్టిల్లు కాదు. అది సరస్వతీ నిలయం. ముక్కోటి దేవతలకు నివాసస్థానం. మీరెంతటి భాగ్యవంతులో, మిమ్మల్ని కట్టుకున్న నేనెంతటి అదృష్టవంతురాలినో ఈనాడు తెలిసి వచ్చిందినాకు. ఇన్నాళ్లు మీ గొప్పతనాన్ని తృణీకరించిన నాకు మీ క్షమాపణయే నిష్కృతి'' అని వేడుకుంది.

కిష్టమూర్తి మేష్టారు దూషణ, భూషణ తిరస్కారాదులకు అతీతుడు. ఆయన పరమ యోగి. ''పిచ్చిదానా! ఏమిటిది? లే! నీకేమైనా మతిపోయిందా? నేను అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ కిష్టమూర్తి మేష్టారినే. నీవు నా సహధర్మచారిణివే!'' అని ఆమెను లేవదీశారు. ఆ సమయంలో గీతాజ్ఞానోపదేశంతో, విశ్వరూప వీక్షణంతో దాసోహమని కాళ్లపై బడిన నరుణ్ణి లేవనెత్తుతున్న నారాయణుడిలా ప్రకాశించారు కిష్టమూర్తి మేష్టారు.